

ఎస్.రాయవరంలో గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

గురజాడ అప్పారావుకు ఘన నివాళి

మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. గురజాడ స్వగ్రామమైన ఎస్.రాయవరంలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- ఎస్.రాయవరం/ఆంధ్రజ్యోతి

రైతు గుండెల్లో తుఫాన్

ఫెంగల్ ప్రభావంతో జిల్లాలో వర్షాలు

- పలు మండలాల్లో ఈదురుగాలులకు నేలకొరిగిన వరిచేలు
- పంట చేతికి అందివచ్చే సమయంలో వాతావరణంలో మార్పు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఈదురుగాలులకు కశింకోటలో నేలకొరిగిన వరి

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి/న్యూస్ నెట్‌వర్క్)

జిల్లాలో ఫెంగల్ తుఫాన్ ప్రభావం కనిపించింది. శనివారం పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురవగా, కొన్ని మండలాల్లో రోజంతా ముసురుతో వాతావరణం చల్లబడింది. అయితే ఈదురుగాలులకు పలు చోట్ల వరి చేలు నేలకొరగడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ అన్నదాతల్లో అలజడి రేపుతోంది. మరికొద్ది రోజుల్లో వరి చేతికి అందుతుందని రైతన్నలు ఆశపడుతున్న తరుణంలో ఈ తుఫాన్ ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం కూడా ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. కోత దశలో వున్న వరి పొలాలను కోయకుండా వాయిదా వేసుకోవాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ముసురు వాతావరణం, అకాల వర్షాలతో పైరుపై తెగుళ్లు దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తహసీల్దార్లతో కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వాతావరణంలో మార్పులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు ఇచ్చే సలహాలు, సూచనలపై సమీక్షించారు. మరో రెండు రోజులు సిబ్బంది మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండి అవసరం మేరకు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.



మాకవరపాలెం మండలం కొండల అగ్రహారంలో తడిసిన వరిచేను

పలు చోట్ల నీటమునిగిన పొలాలు

నక్కపల్లి మండలంలోని జానకయ్యపేట, సీహెచ్ఎల్‌పురం, కాగిత, వేంపాడు, అమలాపురం, ఎన్.నర్సాపురం, చందనాడ తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. మండలంలో ,4400 ఎకరాల్లో రైతులు వరి వేశారు. తుఫాన్ కారణంగా చేతికి అందివచ్చే పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చీడికాడ మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి కోసిన వరి పనలు తడిసి ముద్దయ్యాయి. దీంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. పరవాడ మండలంలో పరవాడ, రావాడ, తానాం, స్వయంభూవరం, గొల్లలపాలెం గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో కోసిన వరి పనలు నీట మునిగాయి. కోత కోసి పొలాల్లో ఉన్న వరి పనలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురం, పల్లావూరు, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, విప్పలపాలెం తదితర ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో వర్షపాతం

జిల్లాలో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురవగా, కొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. అత్యధికంగా ఎలమంచిలిలో 18.8 మిల్లీ మీటర్లు, రాంబిల్లిలో 18.6, బుచ్చెయ్యపేట మండలంలో 16.4 మిల్లీమీటర్ల వాన కురిసింది. పరవాడలో 16.2, నర్సీపట్నంలో 15.8, అచ్యుతాపురంలో 15.2, మునగపాకలో 14.4, నక్కపల్లిలో 14.2, ఎస్.రాయవరంలో 13.2, గొలుగొండలో 12.4, మాకవరపాలెంలో 12, మాడుగులలో 11.8, కశింకోటలో 11.8, నాతవరంలో 10.4, రావికమతంలో 10.4, సబ్బవరంలో 9.2, పాయకరావుపేటలో 9.2, అనకాపల్లిలో 8.4, కోటవురట్లలో 8.4, రోలుగుంటలో 8.2, చీడికాడలో 6.2, కె.కోటపాడులో 3.4, చోడవరంలో 2, దేవరాపల్లిలో 1.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

తడిసిన వరి పనలపై ఉప్పుద్రావణం చల్లుకోండి

- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



చోడవరం మండలం గవరవరంలో వరిపొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):

ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడైనా రైతులు కోసిన వరిపనలు పొలంలో ఉండి తడిసిపోతే, అటువంటి చోట రైతులు తడిసిన వరిపనలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పుద్రావణం వాటిపై చల్లుకోవాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, ఆదిలక్ష్మి, చంద్రశేఖర్‌లు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాలను వారు సందర్శించి వరి పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తగ్గేంత వరకు రైతులు వరికోతలు కోయవద్దని, ఒకవేళ కోసిన వరి పనలు పొలంలో ఉండిపోతే 15 లీటర్ల నీటికి 750 గ్రాముల ఉప్పును కలిపి ఆ ద్రావణం పనలపై చల్లాలని తెలిపారు. ఈ విధంగా చేస్తే ధాన్యం దెబ్బతినకుండా నివారించవచ్చని సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రనాథ్, ఏవో పావని, విస్తరణాధికారులు కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే భరోసా

- జిల్లాలో 93.61 శాతం పింఛన్లు పంపిణీ



గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):

జిల్లా వ్యాప్తంగా ఒకరోజు ముందుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే శనివారం ఉదయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందజేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. జిల్లాలో 2,58,862 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వీరికి ప్రభుత్వం రూ.107.18 కోట్లు విడుదల చేసింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఒక్కరోజులోనే సచివాలయ సిబ్బంది 2,42,317 మంది (93.61 శాతం) లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేశారు. ఇంకా 16,545 మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాల్సి వుందని, సోమవారం అందుబాటులో వున్న లబ్ధిదారులందరికీ పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు.

నెమ్మదిస్తోన్న మహమ్మారి

- అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ దినం

-8లో

దర్జాగా ఆశీలు దందా

గడువు ముగిసినా యథేచ్ఛగా అనధికార వసూళ్లు

- ఆరు నెలలుగా కొనసాగుతున్న అక్రమ వ్యవహారం
- నెలకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఆర్జన
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోని అధికారులు


(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధి అనకాపల్లి పట్టణంలో యథేచ్ఛగా ఆశీలు వసూళ్ల దందా కొనసాగుతోంది. ప్రైవేటు వ్యక్తులు దర్జాగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సుమారు ఆరు నెలలుగా ఈ వ్యవహారం సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

వాస్తవానికి జీవీఎంసీ జోనల్ పరిధి అనకాపల్లి పట్టణంలో ఆశీలు వసూళ్ల కాంట్రాక్టు గడువు ఈ ఏడాది ఏప్రిల్ నెలతో ముగిసింది. మార్చి నెలలో బహిరంగ వేలం ద్వారా ఆశీలు వసూలు కాంట్రాక్టును అప్పగించాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జీవీఎంసీ అధికారులు ఆశీలు వేలానికి అనుమతి ఇవ్వలేదు. ఎన్నికల అనంతరం గత జూన్ నెలలో ఆశీలు వసూళ్ల కోసం వేలం పాట నిర్వహించగా, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కేవలం రూ.51.17 లక్షలకే కాంట్రాక్టు దక్కించుకున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయంతో విశాఖలోని జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. మరోసారి ఆశీలు వసూలుకు వేలం పాట నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉత్తరాంధ్ర స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆశీలు వసూలు, టెండర్ల ఖరారుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. నిబంధనల ప్రకారం జీవీఎంసీ పరిధిలో ఆశీలు పాట నిర్వహించి కాంట్రాక్టరుకు బాధ్యతలు అప్పగించకపోతే జీవీఎంసీ సిబ్బందే ఆశీలు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ పాత కాంట్రాక్టరు అనధికారికంగా ఆశీలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అనకాపల్లి జీవీఎంసీ జోనల్ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం



AP 05 TM 3810

నెం.: 46 తేది: 29/10/24

2024 - 2025

G.V.M.C.(A.K.P.Zone)

ఆశీలు లోడు ఒక్కంటికి

ట్రేడర్స్ వసూలు రూ॥ 100/-లు

కా॥: K. బాల నాగేశ్వరరావు

ప్రైవేటు వ్యక్తులు ఆశీలు వసూలు చేసి ఇస్తున్న రశీదు

అధిక మొత్తంలో వసూళ్లు

గెజిట్ ప్రకారం ఆశీలు వసూలుకు టెండర్లు పొందిన కాంట్రాక్టరు గడువులోగా నిర్దేశించిన మొత్తాన్ని మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, గతంలో ఆశీలు వసూలు చేసిన కొంత మంది గడువు ముగిసినా, దర్జాగా వసూళ్లకు పాల్పడుతున్నారు. సరకు రవాణా చేసే వ్యాన్‌కు రూ.50 వసూలు చేయాల్సి ఉండగా, రూ.100 వసూలు చేస్తున్నారు. రోడ్ల పక్కన చిల్లర వ్యాపారాలు చేసుకొనేవారి నుంచి రోజుకు రూ.10 మాత్రమే ... మిగతా 8వ పేజీలో

విశాఖ డెయిరీపై విచారణ షురూ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ డెయిరీ ఆడారి కుటుంబం సొంత జాగీరుగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఆదాయానికి, వ్యయానికి పొంతన లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డెయిరీ చేయి జారిపోకుండా ఉండేందుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరడం, డెయిరీ నిధులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తోందనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం డెయిరీ అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సభా సంఘాన్ని వేసింది. అందులో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబులకు స్థానం కల్పించింది. రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ఆరోపణలు అనేకం

- సంస్థ నిధులను సొంతానికి వాడుకుంటున్నారనే విమర్శలు
- సభా సంఘం ఏర్పాటు
- విశాఖపట్నం జిల్లా నుంచి ఇద్దరు శాసనసభ్యులకు స్థానం



సొసైటీగా ప్రారంభమైన విశాఖ డెయిరీని ఆడారి తులసీరావు పెద్ద సంస్థగా తీర్చిదిద్దారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు టర్నోవర్ సాధించేలా చేశారు. అదే సమయంలో స్వార్థపూరిత నిర్ణయాలు తీసుకున్నారు. పాడి రైతులను సభ్యులుగా చేసుకుని ఏర్పాటైన సొసైటీని కంపెనీగా మార్చేశారు. అందులో తన కుటుంబ సభ్యులను డైరెక్టర్లుగా పెట్టుకున్నారు. విశాఖ డెయిరీ పేరుతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ భూములు కొన్నారు. వాటి విలువ ఇప్పుడు వందల కోట్ల రూపాయలకు చేరింది. వాటిలో అనేకం చేతులు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతుల కోసమని నిర్మించిన 'కృషి' ఆస్పత్రిని కార్పొరేట్ సంస్థకు అప్పగించేశారు. మూడేళ్లుగా రైతులకు బోనస్ ఇవ్వడం మానేశారు. ఆ స్థానంలో సర్వసభ్య సమావేశాల్లో కానుకలు ఇస్తున్నారు. పాల ధరలు పెరుగుతుంటే..రైతులకు ఇచ్చే సేకరణ ధరను ఇటీవల తగ్గించేశారు. అదేమిటని ప్రశ్నిస్తే నష్టాలు వస్తున్నాయని సమాధానం చెబుతున్నారు. ఇంత భారీ వ్యాపారం చేస్తుంటే నష్టాలు ఎలా వస్తున్నాయనేది అందరి అనుమానం.

- హైదరాబాద్‌లో ఆడారి కుటుంబం సొంతంగా ఒక డెయిరీని పెట్టుకొని దానికి ఇక్కడి నుంచి రోజూ 15 వేల లీటర్ల పాలను సరఫరా చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. డెయిరీలో కీలక స్థానాల్లో ఉన్నవారు ఇలాంటి ప్రైవేటు వ్యాపారాలు చేయకూడదంటున్నారు.
- పరవాడ సమీపాన దేవదాయ శాఖ భూమిని డెయిరీ పేరుతో లీజుకు తీసుకొని కుటుంబ సభ్యులతో ఐస్‌క్రీమ్ పార్లర్ పెట్టించారనే మరో అభియోగం.
- డెయిరీ సభ్యులకు ఆడపిల్ల పుడితే లక్ష రూపాయలు, మగబిడ్డ పుడితే రూ.50 వేలు డిపాజిట్ చేయాలని నిర్ణయం ఉంది. దీనికి రూ.25 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. రైతుల పేరుతో వాటిని డెయిరీ పెద్దలు వాడేసుకున్నారనేది ప్రధాన ఆరోపణ.
- నర్సీపట్నం, చినగదిలి, తదితర ప్రాంతాల్లో డెయిరీ పేరుతో 34 ఎకరాల భూములు ఉన్నాయి. అవి సొసైటీ నిధులతో కొనుగోలు చేసినవి. వాటి లెక్కలు సరి చూడాల్సి ఉంది.
- నరవలో డెయిరీ పేరుతో మూడు ఎకరాల భూమి కొనుగోలు చేసి అందులో 90 సెంట్లు కుటుంబ సభ్యుల పేరు మీదకు మార్చేశారని ఆరోపణలు ఉన్నాయి.
- విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం గర్భాంలో 50 ఎకరాలు డెయిరీ పేరున ఉన్నాయి. వాటి సంగతి తేల్చాల్సి ఉంది.

మొక్కే కదా అని పీకేస్తే..

- వంద మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవలసిందే
- అధికారులకు మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):

మునిసిపాలిటీలో ఇకపై మొక్కలు నరికిన వారిపై చర్యలు తప్పవని, మొక్క నరికితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వంద మొక్కలు నాటి వాటి నిర్వహణ చూసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి ... మిగతా 8వ పేజీలో

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం



అనంత పద్మనాభస్వామి గిరి మెట్లపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భారీగా తరలివచ్చిన భక్తులు

పద్మనాభం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):

అనంత పద్మనాభుని దీపోత్సవ సంబరం అంబరాన్ని తాకింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవాన్ని శనివారం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు వేకువ జాము నుంచి పద్మనాభం చేరుకున్నారు. అనంతుని గిరి ప్రథమ పావంచా వద్ద పూజలు చేసి అనంతరం మెట్లకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టుకుంటూ వెళ్లారు. సాయంత్రం వేళ రాలేమని భావించిన పలువురు ఉదయాన్నే మెట్లపై దీపాలను వెలిగించారు. కొండపై పద్మనాభుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో దేవస్థానం ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉదయం ఐదు గంటల నుంచే అందుబాటులో ఉంచి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు సమయంలో కుంతీమాధవస్వామి ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలిలో మహాకవి గురజాడ వర్ధంతి


గురజాడ చిత్రపటం వద్ద డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల నివాళి

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గ్రంథాలయం ఆవరణలో శనివారం మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని నిర్వహించారు. డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ అప్పారావు జీవిత చరిత్ర, ఆయన రచనలు, సమాజానికి ఆయన అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, గ్రంథాలయాధికారి ఆనంద్, కళాశాల అధ్యాపకులతో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఇక్కడి ప్రశాంతి, కైట్స్ విద్యా సంస్థల్లో ఐద్వా ఆధ్వర్యంలో శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఆర్.లక్ష్మి, మంగతాయారు, రెడ్డి గణేశ్, సోమునాయుడు, సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో ముసురు వాతావరణం

అచ్యుతాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా అచ్యుతాపురం, పరిసర మండలాల్లో ముసురు వాతావరణం నెలకొంది. శుక్రవారం రాత్రి నుంచి ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం నుంచి ఇదే వాతావరణం నెలకొంది. దీనికి తోడు చలి పెరగడంతో పిల్లలు, పెద్దలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో రికార్డు సాధించాలి : ప్రగడ


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి నియోజకవర్గం జిల్లాలో రికార్డు సాధించాలని ఆంధ్రప్రదేశ్ రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఎంజేపురంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. నాయకులు పతివాడ చిన్నయ్య నాయుడు, సేనాపతి వెంకటేష్, పీలా వెంకటరమణ, వీసం నానాజీ, భీముని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, వాటర్ ట్యాంకు మరమ్మతులకు కౌన్సిల్ తీర్మానం

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రహదారుల నిర్మాణానికి, వెంకటాపురంలో శిథిలమైన తాగునీటి పథకం ట్యాంకుకు మరమ్మతు చేపట్టేందుకు శనివారం ఇక్కడ జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేయడంతో పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో వద్దకు వచ్చిన వారికే పెన్షన్!

▸ ఎర్రవరం పంచాయతీలో సచివాలయ సిబ్బంది రూటే వేరు ▸ ఇళ్ల వద్దకు వచ్చి పెన్షన్లు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన ▸ పట్టించుకోని కూటమి నాయకులు


ఎర్రవరంలో ఆటోవద్ద పెన్షన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

అచ్యుతాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ల పంపిణీని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వైసీపీ పాలనలో ఐదేళ్లలో పెన్షన్‌ను దఫదఫాలు పెంచగా, కూటమి ప్రభుత్వం ఒకే సారి వెయ్యి పెంచి ఇస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు పెన్షన్ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో సచివాలయ సిబ్బంది వైసీపీ నాయకుల అడుగుజాడల్లోనే నడుస్తూ పెన్షన్లు పంపిణీ చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. వైసీపీ అధికారంలో ఉండగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో వైసీపీ నాయకులు పంచాయతీల్లో కొన్నింటిని ఏకగ్రీవాలు చేసుకోగా, కొన్ని పంచాయతీలను ఎన్నికల్లో కైవసం చేసుకున్నారు. ఫలితంగా మండలంలో ఎక్కువ పంచాయతీల్లో వైసీపీ సర్పంచ్‌లే ఉన్నారు. కూటమి నాయకులు పంచాయతీలపై దృష్టిపెట్టక పోవడంతో సచివాలయ సిబ్బంది ఇప్పటికీ సర్పంచ్‌లు చెప్పిన విధంగానే చేస్తున్నారు. దీనికి చక్కని ఉదాహరణ శనివారం ఎంజేపురం, ఎర్రవరంలలో జరిగింది. ఎంజేపురంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు స్వయంగా వృద్ధుల ఇళ్లకు వెళ్లి పెన్షను అందించారు. కానీ వైసీపీ అధికారంలో ఉన్న ఎర్రవరం పంచాయతీలో మాత్రం సచివాలయ సిబ్బంది ఆటోలో ఉంటూ వృద్ధులను తమ వద్దకు రప్పించుకొని పెన్షన్‌ను అందజేశారు. శుక్రవారం నుంచి ఇక్కడ వర్షం నిరంతరాయంగా కురుస్తోంది. దీంతో ఎర్రవరం సచివాలయ సిబ్బంది ఆటోలో వచ్చి వృద్ధులను ఆటో వద్దకు రప్పించుకొని పెన్షన్లను పంపిణీ చేశారు. చిన్న చినుకులు పడుతున్నప్పటికీ వృద్ధులు ఆటో వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకున్నారు. ప్రతి నెలా ఈ గ్రామంలో ఇదేవిధంగా జరుగుతోందని అక్కడివారు చెపుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో ప్రతినెలా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం లేదని అంటున్నారు. ఒక వైసీపీ నాయకుని ఇంటి వద్ద కూర్చొని పెన్షన్‌దారులను అక్కడికి రప్పించి పంపిణీ చేస్తున్నారని పలువురు చెపుతున్నారు. పెన్షన్ల పంపిణీ గురించి కూటమి శ్రేణులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పాత వలంటీర్ల సహాయంతో పెన్షన్‌లు పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని కూటమి నాయకులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో తాము కూడా ఏమీ చేయలేకపోతున్నామని ద్వితీయశ్రేణి కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఎన్నికల్లో హామీ మేరకు సకాలంలో పెన్షన్'

మునగపాక : వైసీపీ పాలనలో పెన్షన్లు సకాలంలో అందేవి కావని, కూటమి పాలనలో ఆ పరిస్థితి లేదని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మలాడలో పెన్షన్లు పంపిణీ చేసి మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇలా ఏ ఒక్కవర్గ ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు పెన్షన్లు పెంచి ఇస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే, తిమ్మరాజుపేటలో జరిగిన పెన్షన్ల పంపిణీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మునగపాకలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, టీడీపీ నాయకుడు దాడి మునిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎంజేపురంలో వృద్ధురాలి ఇంటికి వెళ్లి పెన్షను అందిస్తున్న ప్రగడ

విశాఖ డెయిరీ ఆవుపాల ధర పెంచాలని ఆందోళన


కొక్కిరాపల్లిలో ఆందోళన చేస్తున్న పాడి రైతులు

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను పెంచాలని, ఫీడ్ ధరలు తగ్గించాలని కోరుతూ శనివారం మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లిలో రైతులతో కలిసి రైతు సంఘం ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంఘం, సీఐటీయూ వచ్చే నెల రెండో తేదీన నిర్వహించనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. శివాజీ మాట్లాడుతూ విశాఖ డెయిరీ అర్ధంతరంగా ఆవు పాలకు మూడు రూపాయలు తగ్గించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాపల్లి పాలరైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన సెమినార్

ఎలమంచిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సెమినార్ శనివారం ముగిసింది. సైన్స్ అండ్ లిటరేచర్ ప్రభావము, ప్రేరణ అంశంపై నిర్వహించారు. ఇందులో ప్రధానంగా సెర్బియా, ఇథియోపియా, వియత్నాం, దక్షిణ కొరియా, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన ఆచార్యులతో పాటు మన దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన ఆచార్యులు, అధ్యాపకులు రిసోర్స్ పర్సన్లుగా హాజరై వివిధ అంశాలపై పత్రాలు సమర్పించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని తనతో పాటు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని శాంతినికేతన్‌కు చెందిన డాక్టర్ రామచంద్రరాయ్ ప్రారంభించినట్టు చెప్పారు. ఇందులో న్యూఢిల్లీకి చెందిన అస్తిత్వ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డి.ఎస్. శ్రీవాస్తవ సహ ప్రయోజకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం కో-కన్వీనర్‌గా డాక్టర్ కె.సుజాత. వి.ఎ.సత్యనారాయణ, ప్రేమసాగర్, ఐశ్వర్య. రమ్యశ్రీలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్‌ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం : ఎంపీడీవో



మునగపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలో సోలార్ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం. ఉషారాణి తెలిపారు. గ్రామం మొత్తం 1400 పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. సోలార్ కనెక్షన్ కోసం 500 మందికి పైగా వినియోగదారులు ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఈకనెక్షన్ కోసం తొలుత దరఖాస్తు ఫీజుగా సుమారు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరలో గ్రిడ్ అధికారులు గ్రామానికి రానున్నట్టు చెప్పారు.

పేదలకు చీరలు పంపిణీ

రాంబిల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మామిడివాడ గ్రామ మాజీ సర్పంచ్ నెట్టెం సత్యనారాయణ శనివారం వందమంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహనరావు, గ్రామ నాయకులు దాచేపల్లి సరయ్యశెట్టి, కన్న రమణారావు, పప్పల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగ విద్యార్థులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పాఠశాలలో ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు సాగాయి. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం రోజు బహుమతులందజేస్తామని ఆమె చెప్పారు.

హెచ్ఐవీపై అప్రమత్తం


విద్యార్థులకు ఎయిడ్స్ అవగాహన ఐసీటీసీ కౌన్సిలర్

కోటవురట్ల, నవంబర్ 30(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణరాజు సూచించారు. డిసెంబర్ 1న ప్రపంచఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో హెచ్‌ఎం లక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు మానసికంగా ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. వ్యాధి సోకినవారికి ఏఆర్‌టీ మందులు ద్వారా ఆరోగ్యం జీవించవచ్చునన్నారు. ఎయిడ్స్ రోగుల విషయంలో వివక్షచూపరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజుగారిబీడులో వాటర్ ట్యాంక్ నిర్మాణం


వాటర్ ట్యాంక్ నిర్మాణస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజుగారిబీడులో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ ప్రదేశాన్ని శనివారం అధికారులు, నాయకులు పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణాన్ని సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా అవసరమైన ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌ఆర్‌కే వర్మ, టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, వైసీపీ నాయకులు గారా ప్రసాద్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫణివర్మ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రాజుగారిబీడు, ప్రశాంతినగర్, జీవీఆర్.నగర్, సాయినగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరాకు 250 కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపడతామన్నారు. టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐ విభీషణరావుకు గురజాడ చిత్రపటం అందిస్తున్న టీడీపీ నాయకులు


పెదబోదిగల్లంలో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ , ఉపాధ్యాయులు

గురజాడ సాహిత్య సేవలు చిరస్మరణీయం

▸ మహాకవి స్వస్థలం ఎస్. రాయవరంలో ఘనంగా వర్ధంతి

ఎస్. రాయవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. గురజాడ జన్మించిన ఎస్. రాయవరంలో ఆయన వర్ధంతిని శనివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. స్థానికంగా ఉన్న మహాకవి గురజాడ కాంస్య విగ్రహానికి వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావుతో పాటు తహసీల్దార్ రమేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ విభీషణరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు గురజాడ సాహిత్యానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ వేడుకల్లో పాల్గొన్న అధికారులకు నిర్వాహకులు గురజాడ చిత్రపటాన్ని బహూకరించారు. ఉదయం, రాత్రి నిర్వహించిన కోలాటం, జానపద గేయాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

రచనలు అజరామరం

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం జడ్పీ హైస్కూల్‌లో మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, చిన్నారావు, శ్రీదేవి గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు మాట్లాడుతూ తరాలు మారుతున్నా గురజాడ రచనలకు ఇప్పటికీ సమాజంలో ఎంతో ఆదరణ ఉందన్నారు. మూఢనమ్మకాలపై గురజాడ కన్యాశుల్కం నాటిక, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ తదితర రచనలు ఇప్పటికీ అజరామరమన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఆర్వోప్లాంట్‌ను తనిఖీ చేశారు. వాష్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చూడాలని సూచించారు. తరగతి గదుల్లో టెన్త్ విద్యార్థుల పఠనా సామర్థ్యంపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.


టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో


కోటవురట్ల మండలం చౌడవాడలో గాలులకు నేలకొరిగిన వరి చేను


లింగాపురంలో తడిచిన వరిపనలు

నేలకొరుగుతున్న ఆశలు

▸ తుఫాన్‌కు ఒరిగిపోతున్న వరి చేలు
▸ చేలల్లోకి నీరు.. తడిసిముద్దవుతున్న పంట

కోటవురట్ల, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రికురిసిన వర్షానికి వరి పంటకు తీవ్రనష్టం జరిగింది. ఈఏడాది వరిపంట ఆశాజనకంగా దిగుబడులు వస్తాయని ఆశించినరైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జల్లూరు, కైలాసపట్నం, కోటవురట్ల, బీకేపల్లి, రాజుపేట, లింగాపురం యండపల్లిగ్రామాల్లో వరిపైరు నేలవాల్లింది. కోతకు సిద్ధమైన పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన నేలపాలు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఎదురుచూస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కోత కోసిన చేలు తడిసిపోయాయి. వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడానికి అన్నదాతలు శనివారం శ్రమించాల్సి వచ్చింది. వర్షాలకు గింజలు మొలకెత్తి దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల్లో 'ఫెంగల్' గుబులు

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఫెంగల్ తుఫాన్ అన్నదాతల్లో అలజడి రేపుతోంది. మరికొద్ది రోజుల్లో వరి చేతికి అందుతుందుతున్న సమయంలో రైతుల ఆశలపై వర్షాలు నీరు చల్లుతున్నాయి. శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని జానకయ్యపేట, సీహెచ్‌ఎల్‌పురం, కాగిత, వేంపాడు, అమలాపురం, ఎన్.నర్సాపురం, చందనాడ తదితర గ్రామాల్లో వరి నేలకొరిగి పంటకు పాక్షిక నష్టం వాటిల్లింది. ఇదే విధంగా వర్షాలు కురిస్తే పెట్టుబడులు కూడా దక్కవని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ,4400 ఎకరాల్లో వరి సాగవుతోంది. వర్షాలు నేపథ్యంలో వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఏవో ఉమాప్రసాద్ రైతులను సూచించారు. గ్రామాల్లో పంట నష్టంపై వివరాలు సేకరించే పనిలో వ్యవసాయశాఖాధికారులున్నారు.

ఏయూ హాకీ టీమ్‌కు నక్కపల్లి విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివయ్య

నక్కపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రగడ రోహిత్, కర్రి భాస్కర్ ఏయు హాకీ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య అభినందించారు. డిసెంబరు 3 నుంచి 8 వరకూ చెన్నైలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో ఏయూ జట్టు తరపున వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ చెప్పారు.

'పేట'లో 90 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ


పాయకరావుపేటలో వర్షంలో పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాయకరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ 90శాతానికిపైగా పూర్తయింది. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పాయకరావుపేట పట్టణంతోపాటు మండలంలోని 24 పంచాయతీల్లో ఉన్న 25 సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఏఓ సీహెచ్‌ఆర్‌కే వర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని 24 పంచాయతీల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర కేటగిరీలకు చెందిన మొత్తం 12,858 మంది పింఛనుదారులకు రూ. 5,24,06,000 మొత్తం పంపిణీ చేయాల్సి ఉందన్నారు. శనివారం 90 శాతం పైగా అందించామన్నారు.

పౌర హక్కులపై అవగాహన

పాయకరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఇందిరాకాలనీలో దళితులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, వివిధ చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డన్లు పాల్గొన్నారు.

అన్నదాతను కలవరపరి'చేను'

» తుఫాన్ కారణంగా ఈదురు గాలులు » పలు చోట్ల నేలకొరిగిన వరి పంట » వర్షాలు కురుస్తుండడంతో గింజలు మొక్కమొలుస్తాయని ఆందోళన



పరవాడలో నేలకొరిగిన వరి చేను

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కారణంగా శనివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షంతో పాటు ఈదురుగాలులకు పలుచోట్ల వరి చేలు నేలకొరిగాయి. పంట కోతకొచ్చిన సమయానికి తుఫాన్ రావడంతో నేల పాలవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరవాడ, రావాడ, తానాం, స్వయంభూవరం, గొల్లలపాలెం గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గత నాలుగు రోజులుగా రైతులు వరి కోతలు చేపడుతూ కుప్పలు వేస్తున్నారు. అయితే కొంత మేర వరి చేలు ఇంకా పొలాల్లోనే ఉంది. వర్షం కారణంగా నేలకొరిగింది. మరో రెండు రోజుల పాటు వర్షం కురుస్తే గింజలు మొలకెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే, తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది.చలిగాలులు కైడా వీయడంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మూలస్వయంభూవరం, సోమునాయుడు పాలెం, వెంకటాపురం, రేఖవానిపాలెం, పాతరాజన్న పాలెం గ్రామాలకు వెళ్లే రహదారులు వర్షం కారణంగా అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుమ్మపాల : తుఫాన్ కారణంగా రైతులంతా అప్రమత్తంగా ఉండాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి సూచించారు. తుమ్మపాలలో శనివారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. వరి పంటపై రెల్లు రాల్చే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని పేర్కొంటూ నివారణ చర్యలను వివరించారు. వరి పంట తర్వాత రెండో పంటగా వేసుకోవడానికి మినుములు, పెసలు తదితర విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి రంగాచారి, ఆత్మ ఏటీఎం రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



తుమ్మపాలలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణమూర్తి

'మంత్రి లోకేశ్ దృష్టికి విద్యార్థుల సమస్యలు'



మాజీ ఎమ్మెల్యే పీలాకు వినతి పత్రం అందిస్తున్న మహిళ

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇక్కడి టీడీపీ కార్యాలయం వద్ద శనివారం ఆయనను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ద్వారా సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామని పీలా తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, పార్టీ నాయకులు సబ్బవరపు గణేశ్, శెట్టి వెంకటరమణ, కాండ్రేగుల చిన్న, పొలారపు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో దాడి రత్నాకర్, టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం పెదరామస్వామి కల్యాణ మండపంలో టీడీపీ సభ్యత్వ నమోదు శనివారం విస్తృతంగా జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాన్ని ఎవరైనా పొందవచ్చునన్నారు. సభ్యత్వం ఓ భరోసా వంటిదన్నారు. దీని ద్వారా ప్రతి వ్యక్తికి రూ.ఐదు లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొణతాల సత్యనారాయణ, దాడి ఈశ్వరరావు, కర్రి అప్పాజీ, శిలపరశెట్టి బాబి, కోరిబిల్లి ఆర్చ్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో గల అమృత మహా కాళేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక మాసం ఆఖరి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. ముందుగా స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొలిమేర సత్యనారాయణ, బుద్ధ భూలోకనాయుడు, బొడ్డేడ వెంకటరావు, బుద్ధ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'రాగూర్'లో మృతుల కుటుంబాలకు అన్యాయం



చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాగూర్ పరిశ్రమలో విషవాయువుల లీకైన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు యాజమాన్యం తీరని అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ధ్వజమెత్తారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.40 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం దారుణమన్నారు. ఈ ఏడాది ఆగస్టులో సినర్జిన్, ఎసెన్షియా ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయా యాజమాన్యాలు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాయన్నారు. రాగూర్ యాజమాన్యం మాత్రం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 40లక్షలు ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. కార్మికశాఖ మంత్రి సుభాశ్ కూడా నష్టపరిహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందజేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

'పంచాయతీల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం నిధులు'



బీజేపీ శ్రేణుల సమావేశంలో తాతారావు తదితరులు

కొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కప్పిరి తాతారావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో గ్రామీణ కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డేడ శేషగిరిరావు, సూర్యనారాయణ, దేవర బాబూరావు, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యపై విశాఖ డెయిరీ వద్ద ధర్నా రేపు

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆవు పాల సేకరణ ధర లీటరుకు మూడు రూపాయలు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ డిసెంబరు రెండో తేదీన విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నామని పాల రైతుల సంఘం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు తెలిపారు. బయ్యవరం పాల కేంద్రం వద్ద శనివారం ఏర్పాటైన పాడి రైతుల సమావేశంలో మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, పశువులకు దాణా పాల ప్యాకెట్లు ధరలు పెరుగుతుంటే రైతులకు ఇస్తున్న పాల ధర మాత్రం తగ్గించడం అన్యాయమన్నారు. విశాఖ డెయిరీకి ఏడు జిల్లాల నుంచి సుమారు మూడున్నర లక్షల మంది రైతులు పాలు పోస్తున్నారన్నారు. సదరు సంస్థ నిర్ణయం వల్ల ఆయా రైతులు నష్టపోతున్నారని వాపోయారు. డెయిరీలో ఉన్న వందల కోట్ల రూపాయల లెక్కలు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఆవుపాలకు లీటరుకు రూ.50, గేదె పాలకు రూ.80, దాణా రాయితీ 75శాతం ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నట్టు చెప్పారు. సోమవారం విశాఖ డెయిరీ వద్ద జరగనున్న ఆందోళనకు అంతా తరలి రావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో రాంబాబు, దుర్గినాయుడు, సూరిబాబు, సాయినాయుడు, లక్ష్మి, లావణ్య, రాజమ్మ, లోవరాజు, సత్తిబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లతో ఒకరిపై కేసు

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. గవరపాలెం ముత్రాసు వీధిలో యాదల గోపి పాన్‌షాపు వద్ద మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందిందన్నారు. శనివారం సిబ్బందితో దాడిచేసి అతని వద్ద నుంచి ఇరవై మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

» ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు



తుమ్మపాలలో పింఛనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల



మొగలిపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ



అనకాపల్లిలోని చినరాజుపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న బుద్ధ

తుమ్మపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలో శనివారం పింఛన్ల పంపిణీని పరిశీలించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో సమస్యలను కూటమి శ్రేణులు గుర్తించి, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం తుమ్మపాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన దాడి జగదాంబను కొణతాల ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీడీవో కేవీ నరసింహారావు, నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, పీలా తాతునాయుడు, పెతకంశెట్టి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురంలో శనివారం సామాజిక పెన్షన్లను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. నాయకులు అంగటి నానాజీ, గండి సత్యం, రాంబాబు, బండయ్య, అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఓ పక్క చిరు జల్లులు కురుస్తున్నా శనివారం తెల్లవారుజామున ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సందడిగా సాగింది. పట్టణంలోని జీవీఎంసీ పరిధిలో గల ఐదు వార్డుల్లోనూ సచివాలయాల సిబ్బంది ఐదున్నర గంటలకే వార్డుల్లోకి వచ్చి ఆయా లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. చినరాజుపేట ప్రాంతంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. సాగి సుబ్బరాజువీధిలో గవర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, 80వ వార్డులో సత్యనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళీ పింఛన్లు పంపిణీ చేశారు.

పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ : డీఈవో

అనకాపల్లి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ఏడో తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను ప్రధానోపాధ్యాయులంతా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు శనివారం సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి పాఠశాలల్లో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు శతశాతం మీటింగ్‌కు హాజరయ్యేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణమంతా పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్న నేపథ్యంలో ఎటువంటి లోపాలు లేకుండా ఈ సమావేశం జరిగేలా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి : సీఐ



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం సాగర్ సిమెంటు ఫ్యాక్టరీలో కార్మికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయారని వివరించారు. వాహనంపై ప్రయాణించేటప్పుడు రోడ్డుకు ఎడమ వైపు మాత్రమే ఉంటూ, నిర్దేశించిన వేగంతో వెళ్లాలన్నారు. ఎక్కువ మంది వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోను మాట్లాడుతున్నారని, దీని వల్ల మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారుల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్‌కు ఎంపికైన లాస్యంత్‌కు ప్రోత్సాహం

కొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన వీరమాచినేని శ్రీసూర్య లాస్యంత్‌కు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రూ.25 వేల నగదును సమకూర్చారు. ఈ మేరకు ఇక్కడి జనసేన కార్యాలయంలో పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ శనివారం లాస్యంత్ తల్లి పుష్పకు సదరు నగదును అందజేశారు. క్రీడల్లో యువతను మరింత ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే కొణతాల సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఇంటింటి సర్వేలో సబ్బవరం టాప్ : ఎండీవో

సబ్బవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి సర్వేలో సబ్బవరం మండలం 88 శాతంతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 21,270 నివాసాలు ఉండగా, అందులో 18,274 గృహాలకు సంబంధించి ఇంటింటి సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. గతంలో ఇటువంటి సర్వే చేపట్టినప్పటికీ సాంకేతిక లోపాల కారణంగా మరలా చేసినట్టు చెప్పారు. ఒక్కో ఇంట్లో వివరాలు సేకరించి, ఒకరి ఫొటోతో జియోట్యాగింగ్ చేయడం జరుగుతుందన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

తుమ్మపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు అన్నారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా శనివారం అల్లిఖానుడుపాలెంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి ప్రభుత్వం నుంచి సాధించాల్సిన హక్కులను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, సర్పంచ్ ఎస్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మపాల గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్టు శనివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఇంటర్మీడియట్ చదివి, ఓ వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న యువతి శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఎక్కడ వెతికినా జాడ కనిపించకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పేదలు, వృద్ధులకు రగ్గులు పంపిణీ

కశింకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోట సత్యసాయి ఆశ్రమంలో పేదలు, వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, మాజీ ఎంపీపీలు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు అవగాహన ర్యాలీ

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా ఇక్కడి డీఎల్ఏటీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం అధికారులు, సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఏడీఎం హెచ్‌ఓ, డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఆర్‌టీ వైద్యాధికారి హేమ, సీఎస్‌వో డాక్టర్ స్పందన తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తి గురజాడ'



గురజాడ చిత్రపటం వద్ద ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం తదితరుల నివాళి

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సాహితీవేత్త, కన్యాశుల్కం నాటక రచయిత గురజాడ వెంకట అప్పారావు 109వ వర్ధంతిని స్థానిక బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ ఒకరు అని ఆమె గుర్తు చేశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు గురజాడ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి, టీచర్లు సుమలత, ప్రశాంతి, సత్య, తులసీ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో గురజాడ అప్పారావు వర్ధంతిని జరిపారు. సీఐటీయూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు డి.డి.వరలక్ష్మి, దాకారపు శ్రీనివాసరావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ అప్పారావు జీవిత చరిత్రను వివరించారు. ప్రభుత్వాలు స్పందించి మహిళా సాధికారత సాధించిన నాడే గురజాడకు ఇచ్చిన నిజమైన నివాళిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తనూజ, రామలక్ష్మి, శ్యామల, వెంకటలక్ష్మి, జగదీశ్వరి, యమున, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కశింకోట గ్రామంలో...


కొయ్యూరు మండలంలో కోతకు సిద్ధమైన వరి చేలు


సీలేరు సమీపంలో టార్పాలిన్‌లతో కప్పిన వరికుప్పలు


పంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, వ్యవసాయ సిబ్బంది

అన్నదాతల్లో కల'వరి'ంత

- ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు
- వరి, ఇతర పంటలకు నష్టం

కొయ్యూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండంతో రైతులలో ఆందోళన నెలకొంది. వర్షంనుంచి వరి పంటను రక్షించుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. మండల వ్యాప్తంగా సాగుఅయిన వరిలో ఇప్పటికే మూడో వంతు పంట కోతలు పూర్తిచేసి కళ్లాలకు చేర్చారు. మిగిలిన పంట కోతకు సిద్ధంగా ఉంది. దీంతో వర్షం ప్రభావంతో పండిన పంట చేతికి అందకుండా పోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బూదరాళ్ళ, మఠంభీమవరం, యు.చీడిపా లెం తదితర మరో నాలుగు పంచాయతీలలో రాగులు, సామలు, పప్పుధాన్యాల పంటలు చేతికి వస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షాలు కురుస్తుండడంతో పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. నూర్పులు పూర్తయి దినుసులు ఇంటికి చేరేవరకు వరుణుడు కరుణించాలని రైతాంగం గ్రామ దేవతలకుమొక్కుతున్నారు. పొలాల్లో కోసిన వరి చేలను టార్పాలిన్‌లతో కప్పాలని ఏవో ఉమాదేవి రైతులకు సూచించారు.

గిరిజన రైతుల్లో ఆందోళన

సీలేరు: జీకేవీధి మండల పరిధి ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల, గాలికొండ, సీలేరు పంచాయతీల్లో శనివారం ఉదయం నుంచి చిరు జల్లులు కురుస్తున్నాయి. వరి, సామలు, రాగులు తదితర పంటలు కోత దశలో ఉన్నాయి. ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో కోసిన పంట పొలంలోనే కుప్పలుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ వరి కుప్పలు తడిపిపోకుండా ప్లాస్టిక్ కవర్లను కప్పుతున్నారు. భారీ వర్షాలు పడితే చేతికి అందుకువచ్చిన పంట దెబ్బతింటుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

తుఫాన్ ప్రభావంతో చలి గాలులు

బంగాళాఖాతంలో నెలకొన్న ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జీకేవీధి మండలం సీలేరులో పగటిపూట ఉష్ణోగ్రతలు బాగా తగ్గుముఖం పట్టడంతోపాటు చలిగాలులు వీస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి: ఫెంగల్ తుఫానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని చౌడుపల్లి, సాడిక, యర్రబొమ్మలు గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారితో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ మండలంలో 40శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. రైతులు పనలను కుప్పలుగా చేసుకుని తడవకుండగా టార్పాలిన్లు కప్పుకోవాలన్నారు. ధాన్యం రంగుమారకుండగా ఉండేందుకు 5శాతం ఉప్పుద్రావణాన్ని కుప్పలపై చల్లుకోవాలన్నారు. రబీ పంట కాలం రాజ్‌మా బీమా చేయించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి: ఏపీసీపీఎస్ఈఏ


ఛలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

చింతపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో డిసెంబరు 10న తలపెట్టిన ఛలో విజయవాడ పోస్టర్లను ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సీపీఎస్ వల్ల ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతోందన్నారు. ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు కె. చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె. మహేశ్, డీటీఎఫ్ మండలాధ్యక్షుడు సాగిన కోటిబాబు, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు అచ్యుత్ పాల్గొన్నారు.

డీఆర్వో సత్యనారాయణ సేవలు అభినందనీయం


డీఆర్వో సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

చింతపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన లోతుగెడ్డ రేంజ్ డిప్యూటీ రేంజ్ అధికారి వి. సత్యనారాయణ సేవలు అభినందనీయమని రేంజ్ అధికారి ఎల్‌బీకే పాత్రుడు కొనియాడారు. శనివారం పదవీ విరమణ పొందిన సత్యనారాయణ, వీవీఆర్ కుమారి దంపతులను అటవీశాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి పాత్రుడు మాట్లాడుతూ ఏబీవో గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ 39ఏళ్ల పాటు సేవలందించారన్నారు. గిరిజనులతో మంచి సంబంధాలు ఏర్పరుచుకున్నారన్నారు. ఆయన శేష జీవితం సుఖశాంతులతో సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌వో కార్యాలయం సూపరింటెండెంట్ సత్యనారాయణ, అటవీశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్. లక్ష్మణ, మాతె సింహాచలం, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి


జ్యోతి (ఫైల్)

ముంచంగిపుట్టు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి వనుగుమ్మ పంచాయతీ సంగడ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని ప్రధాని జ్యోతి (20) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. పాడేరులోని మోదమాంబ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న జ్యోతి గొంతు, శ్వాస సమస్యలతో బాధపడుతోంది. తల్లిదండ్రులు అర్జున్, కౌసల్యలు ఈ నెల 23న ఒడిశాలోని ఆశాకిరణ్ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ శనివారం జ్యోతి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి, వివిధ పార్టీల నేతలు శంకర్‌రావు, దేవ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నాయకులు కోరారు.

సామాజిక పింఛన్లు పంపిణీని ప్రారంభించింది టీడీపీనే

- జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

హుకుంపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభించిన ఘనత తెలుగు దేశం పార్టీదేనని జీసీసీ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి హయాంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లను పంపిణీని అమలు చేశారన్నారు. చంద్రబాబు ఇటీవల పింఛన్ రూ.4వేలకు పెంచారన్నారు. మండల అధ్యక్షులు తులసీరావు, జీసీసీ మాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు, ఎంపీటీసీ సభ్యుడు కోమ్మ రమ, తెలుగు మహిళా అధ్యక్షురాలు సాగరి సత్యవతి, ఎస్.సూర్యకాంతం, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వసంతకుమారి, సాగరి సుబ్బారావు, పాండు సర్పంచ్‌లు బాకూరు రమణ, సుమన్, సత్యనారాయణ, చపల్లి శంకర్ పాల్గొన్నారు.

ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రోజులోనే సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు పేర్కొన్నారు. ఒకటో తేదీ ఆదివారం రావటంతో ఒక్క రోజు ముందుగానే ప్రారంభమైన పింఛన్ల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో శనివారం దొరబాబు కొయ్యూరులో లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో నేతలు మేడిబోయిన సత్తిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హుకుంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న శ్రావణ్‌కుమార్

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పాడేరురూరల్: పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌తో కలిసి కొత్త పాడేరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలపై ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకాన్ని అర్హులకు సకాలంలో లబ్ధిదారులకు చేరువ చేస్తున్నట్టు వివరించారు. పాడేరు పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, రాష్ట్ర జీసీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, బీజేపీ నాయకులు కె.రాజారావు, రామకృష్ణ, నాయకులు డప్పోడి వెంకటరమణ, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


కొత్తపాడేరులో కలెక్టర్‌తో కలిసి పింఛన్ అందిస్తున్న గిడ్డి ఈశ్వరి

చింతపల్లిలో 96శాతం పంపిణీ

చింతపల్లి: మండలంలో 96శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. కార్యదర్శి శ్రీధర్, పంచాయతీ గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం విజయ వంతమైనట్టు ఎంపీడీఓ ఏ.వి.వి.కుమార్ తెలిపారు. మండలం మొత్తం 5999 సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేసినట్టు వివరించారు.

విద్యార్థుల మరణాలు పునరావృతం కారాదు

- ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రామలక్ష్మి

అరకులోయ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణాలు పునరావృతం కాకుండా జాగ్రత్త తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి సూచించారు. యండపల్లివలస గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న జన్ని ప్రియాంక అనారోగ్యకారణంగా మృతి చెందిన నేపథ్యంలో ఆమె పాఠశాలను, మృతిచెందిన ప్రియాంక స్వగ్రామం దుమ్మగుడ వెళ్లి బాధిత తల్లిదండ్రులను శనివారం పరామర్శించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, ఐటీడీఏ గురుకుల పాఠశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తితో మాట్లాడి బాలికమృతికి సంబంధించి వివరాలను అడిగితెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా మరింత జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు వండిపెడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం దుమ్మగుడ వెళ్లి ప్రియాంక తల్లిదండ్రులను పరామర్శించి వారిని ఓదార్చారు. అనంతరం భల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. కార్య క్రమంలో మాజీ స్వచ్ఛంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి పాల్గొన్నారు.

లైసెన్సు లేకుంటే వాహనాలు సీజ్: ఎస్ఐ


వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) లైసెన్సు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్.ఐ.డి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వాసు అన్నారు. మండల కేంద్రంలో వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. హెల్మెట్, ఇన్సూరెన్స్, లైసెన్సు లేని వారినుంచి రూ.35 వేలు జరిమానా వసూలు చేశారు. లైసెన్సు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, నిబంధలకు విరుద్ధంగా నడిపినా కేసులు తప్పవన్నారు. ఘాట్ రోడ్డులో ప్రయాణంలో జాగ్రత్తలు వహించాలన్నారు.

విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి: సీపీఎం

పాడేరురూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. శనివారం ఆయన సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పలువురు విద్యార్థులు మృతి చెందడంతో తల్లిదండ్రులు మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటికే సుమారు 10 మంది మరణించారన్నారు. ఆశ్రమాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించలేదన్నారు.దీంతో. చిన్నపాటి జ్వరాలకే విద్యార్థులు మృతి చెందుతున్నారని, రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అరకు గురుకుల బాలికల పాఠశాల్లో 6వ తరగతి విద్యార్థిని ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్.సుందరరావు, పాలికి లక్కు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

గూడెంకొత్తవీధి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని పాడేరు టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు ముక్కలి రమేశ్ అధ్యక్షతన కార్యకర్తలు, నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు నియోజక వర్గం ప్రజలు కూటమి అభ్యర్థిని గెలిపించకున్నా కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. గిరిజనుల ఓట్లతో ఓట్లతో గెలుపొందిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి ఆంక్షల వల్ల చట్ట సభలకు వెళ్లడంలేదన్నారు. దీంతో గిరిజన ప్రజల సమస్యలు చట్ట సభల్లో మాట్లాడే ప్రతినిధిలేకుండాపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ప్రతి గ్రామానికి కనెక్టివిటీ రోడ్లు, తాగునీటి నీటి పథకాలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు.ఆర్వీనగర్-సీలేరు రహదారి నిర్మాణానికి రూ.18కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు బొర్ర విజయరాణి, నాయకుడు రీమల ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గంటా నళిని, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు కొండలరావు పాల్గొన్నారు.

'విజ్ఞానానికి సోషల్ మీడియాను ఉపయోగించాలి'


మాట్లాడుతున్న న్యాయవాది బుజ్జిబాబు

అరకులోయ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం సోషల్‌మిడియా- సైబర్ బుల్లింగ్ అనే అంశంపై కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవోల ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక న్యాయవాది బుజ్జిబాబు పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియాను అవగాహన పెంచుకోవాలన్నారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కామర్స్ అధ్యాపకుడు రాజు మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంప్యూటర్ అధ్యాపకులు దొన్ను, భవానీ, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి సైబర్ క్రైంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండబాబు, అధ్యాపకులు సుందరీరాణి, గణేశ్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటిక ప్రదర్శన

చింతపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక రూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. శనివారం రాత్రి కళాశాల మైదానంలో సంఘం శరణం గచ్ఛామి నాటికను హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్ అకాడమి ప్రదర్శించింది. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ప్రదర్శించిన ఈ నాటికి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి జి. జగత్‌రాయ్, ఉపాధ్యాయుడు ముల్ల వెంకట రమణ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం


ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులు

పాడేరురూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల మాసోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెల రోజులు వివిధ ఆధ్యాత్మిక కార్య క్రమాలు, అన్న సమారాధన, పసుపు, కుంకుమ పంపిణీ తదితర కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టారు. శనివారం ఊరేగింపుగా గౌరీపరమేశ్వరులనుతీసుకువెళ్లి అనుపోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘంప్రతినిధులు కొణతాల సతీష్, కె.ప్రశాంత్, ఎ.మోహన్, ఎస్.మధు, బి.సాయి, పి.కొండలరావు, బి.ఆనందరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ వర్తక సంఘం ప్రతినిధులు

పెదబయలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదివాసీ వర్తక సంఘం అధ్యక్షుడు పి.భాస్కరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం 'ప్లాస్టిక్‌ను నివారించండి- పర్యావరణాన్ని కాపాడండి' పేరిట పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో వాటిని దుకాణాల వద్దకు వెళ్లి అతికించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యాపారులు ప్లాస్టిక్ సంచులు విక్రయాలను నిలిపివేయాలన్నారు. వినియోగదారులు గుడ్డ సంచులు తీసుకువచ్చి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో వర్తకులు రాధాకృష్ణ, జానకీరావు, జీవన్‌కుమార్, కొండబాబు, చిన్ని, మత్స్యలింగం, దిలీప్ కుమార్, నాగేశ్, రమేశ్, శ్రీను,లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో


టూరిజం అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శనివారం రాత్రి అకస్మికంగా సందర్శించారు. జలపాతం నిర్వాహకులు ఎ-కోటూరిజం కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యాటకులు స్నానాలు అనంతరం దుస్తులు మార్చుకొనేందుకు వీలుగా నాలుగు రూమ్‌లు ఏర్పాటు చేశామని, పార్క్, గ్రీన్ గ్రాస్ మెట్లు పక్క నుంచి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని పీవోకు వారు వివరించారు.

కేన్సర్‌పై జాగ్రత్త అవసరం


పినకోట పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సాధన

అనంతగిరి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డి. సాధన సూచించారు. కోరారు. మండలంలోని జీనబాడు గ్రామంలో ప్రజలకు ఈ మేరకు అవగాహన కలిగించారు. అనంతరం జీనబాడు బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు కేన్సర్ నియంత్రణపై జాగ్రత్తలు వివరించారు. అనంతరం పినకోట హాస్పటిల్‌లో టీకాలు ఉంచే ఫ్రిజ్‌లను, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను ఆమె తనిఖీ చేశారు. వైద్యాధికారి జి.వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ వి.రవిశర్మ, పర్య వేక్షకురాలు సావిత్రి, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీకి చెక్



పాడేరులో నిర్వహించిన ర్యాలీలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శనివారం రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హేమలత విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చిట్టిబ్బాయి మాట్లాడుతూ 1980లో వచ్చిన హెచ్ఐవీకి నేటి వరకు మందు లేదన్నారు. అవగాహనతోనే దీనిని నిర్మూలించగలమన్నారు. ఆసందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ వ్యాసరచన, రంగోళి, ఫేస్ పెయింటింగ్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. అనంతరం ర్యాలీ, మానవహారం చేశారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పాపారత్నం, ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్ దామోదర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం విద్యార్థులకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్య క్రమంలో భాగంగా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ సాయిరాం ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, దాని వల్ల అనర్థాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన జా గ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ: ఎన్ఎస్ఎస్ పీవోలు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలల విద్యార్థులు అగాహన ర్యాలీ చేపట్టారు. ఎయిడ్స్ నియంత్రణపై నినాదాలు చేశారు.

కాలం చెల్లిన రొట్టెలు విక్రయం



రొట్టె ప్యాకెట్‌పై ఎక్స్‌పైరీ డేట్

పెదబయలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ బేకరీలో కాలం చెల్లిన రొట్టెలు విక్రయించడంతో కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీ ల్యాబ్‌టెక్నీషీయన్‌గా పనిచేస్తున్న కూడ నీలకంఠం పిల్లల కోసం పాత స్టేట్‌బ్యాంక్ భవనం ఎదుట ఉన్న బేకరికి వెళ్లారు. స్నాక్స్‌తోపాటు రొట్టె తీసుకున్నారు. రొట్టె ప్యాకెట్‌లో ధర తప్పా, కాలపరిమితి ముద్రించలేదు. బూజుపట్టి ఉంది. దీనిపై ప్రశ్నిస్తే మరో మరొక్క బ్రెడ్ ప్యాకెట్ ఇచ్చారు. దానిపై నవంబరు 16 తేదీ వరకు కాలపరిమితి ఉన్నట్టు స్టిక్కర్ అంటించి ఉంది. కాలం చెల్లిన ఇలాంటివి తింటే ఫుడ్ పాయిజన్ జరిగి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని నీలకంఠం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అన్నదాతలో ఫెంగల్ గుబులు

» తుఫాన్ ప్రభావంతో చెదురుమదురు వర్షాలు
» ఈదురుగాలులకు నేలకొరిగిన వరి చేలు
» చేతికందే సమయంలో పంట పోతుందని రైతుల దిగాలు

అన్నదాతను ఫెంగల్ తుఫాన్ వణికిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో నీటిపాలైంది. పలు మండలాల్లో శనివారం చెదురుమదురు వర్షాలు కురుస్తుండడంతో పంట నష్టం వారిలో గుబులు రేగుతోంది. ఈదురుగాలులకు వరి చేలు నేలకొరగడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

రావికమతం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుగా 20.25 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేశారు. వరి నాట్లు సకాలంలో వేశారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరి సాగు ఆశాజనకంగానే వచ్చింది. పంట కూడా ఆశించనట్టుగానే చేతికందే తరుణంలో రైతులను తెగుళ్ల భయపెట్టాయి. వేలాది రూపాయలు వెచ్చించి తెగుళ్ల నుంచి వరి పంటను కాపాడుకున్న రైతులు కోతలకు సన్నద్ధమవుతున్న సమయంలో ఫెంగల్ తుఫాన్ వచ్చింది. దీంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


రావికమతం: పెదపాచిల వద్ద ఈదురుగాలులకు నేలకొరిగిన వరి

సుమారు 100 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుతున్నారు. సిహెచ్.నాగాపురం, పల్లావూరు, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, విప్పలపాలెం తదితర గ్రామాల్లో కోసిన వరి పనులు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో వరి పంట కోసేందుకు కొన్ని చోట్ల సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈదురుగాలులకు చాలా వరకు పంట నేలకొరింది. ఇదే పరిస్థితి కొనసాగితే పంట దక్కదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంటలో...


రోలుగుంట: కొమరవోలులో వర్షానికి తడిసిన వరి పనలు

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలకు వరి పనలు నీట మునిగాయి. కొమరవోలు, కొవ్వూరు, అడ్డసరం, జె.నాయుడుపాలెం, జగ్గంపేట, గుండుబాడు, కొండపాలెం, నిండుగొండ తదితర గ్రామాల్లో కోసిన వరి పనలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల ధాన్యం రంగు మారడమే కాకుండా మొలకెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు. తడిసిన వరి పనలను గట్లపైకి, మెరక ప్రదేశాలకు చేర్చి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.


నాతవరంలోని ఓ పొలంలో పూర్తిగా నేలకొరిగిన వరి పంట

నాతవరంలో...

నాతవరం: మండలంలో వర్షంతో పాటు ఈదురుగాలులు వీచడంతో చేతికందే సమయంలో వరి పంట నేలకొరిగింది. మరికొన్ని చోట్ల పాక్షికంగా నీట మునిగింది. దీంతో రైతులు విలవిలలాడుతున్నారు. ఆదివారమైనా వర్షం తగ్గిపోతే కాస్త ఊపిరి పీల్చుకుంటామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ కారణంగా వరి పనలు తడిచి ముద్దవుతున్నాయి. రెల్ల రాల్చు పురుగు రావడంతో వరి పంటను కోసేవారు. దీంతో శనివారం కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లోనే వరి పనలు తడిచి ముద్దవుతున్నాయి. దేవరాపల్లి, నాగయ్యపేట, కాశీపురం, సీతంపేట తదితర గ్రామాల్లో కోసిన వరి పంట తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని చాలా గ్రామాల్లో తుఫాన్ వర్షాలు, ఈదురుగాలులకు వరి పొలాలకు నష్టం వాటిల్లుతుంది. మండల వ్యాప్తంగా

చీడికాడలో...

చీడికాడ: తుఫాన్ కారణంగా శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి కోసిన వరిచేను తడిసిపోయింది. పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైందన్న ఆనందంలో ఉన్న రైతులు ఒకపక్క పురుగుల బెడద, మరోపక్క తుఫాన్ బెంగతో దిగాలు చెందుతున్నారు. తడిసి ముద్దయిన వరి పొలాలను గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


చీడికాడ: మంచాల గ్రామంలోని పొలాల్లో తడిసిన వరి చేను

వాడీవేడిగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

జగనన్న లేఅవుట్‌లో భూమి చదును పనిని నామినేటెడ్‌గా ఇవ్వడంపై సభ్యుల మధ్య వాగ్వాదం
గత ప్రభుత్వంలో తాగునీటి సరఫరా గురించి పట్టించుకోలేదని కౌన్సిలర్ పద్మావతి విమర్శ

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మునిసిపాలిటీలోని జగనన్న లేఅవుట్‌లో రూ.1.63 కోట్లతో చేపట్టిన భూమి చదును పనిని నామిటేడ్ పద్ధతిలో కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా 22వ వార్డు కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య తల్లి మరణానికి సభ్యులు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వెంకలక్ష్మి 18 అంశాలతో ఉన్న అజెండాను, మరో ఐదు అంశాలతో అత్యవసర సమావేశం అజెండాను చదివి వినిపించారు. తొమ్మిదో వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.1.63 కోట్లతో జగనన్న కాలనీ లేఅవుట్‌లో చేపట్టిన భూమి చదును పనులు కాంట్రాక్టర్‌కు నామినేటెడ్ పద్ధతిలో ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ వైసీపీ జెండా భూజాన వేసుకొని తిరిగాడని, ఆ కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోతే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పి పక్కన కుర్చొబెట్టారని ఎద్దేవా చేశారు. దీనికి మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎళ్లకాలం ఒక్కరే అధికారంలో ఉండరని అన్నారు. ప్రజలు అవకాశం ఇచ్చారు కాబట్టి రాజకీయాలు చేయకుండా పట్టణం అభివృద్ధి కోసం పని చేయాలని హితవు పలికారు. ఈ సమయంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. 24వ వార్డు కౌన్సిలర్ మధు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్ వేయడానికి వార్డులలో రోడ్లు తవ్వేశారని, ఆ గోతులను చూడ్వాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌కు ఉండదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తప్పు జరిగింది కాబట్టే తప్పు జరిగిందని అంటున్నామని ఆయన స్పష్టం చేశారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ పైపులైన్ వేయాలంటే గోతులు తవ్వడం తప్పదని స్పష్టం చేశారు. లేఅవుట్‌లో భూమి చదును పనులు ఒక పని కింద చేయలేదని, విభజించి చేశారని అన్నారు. 2014 నుంచి 2019 సంవత్సరం వరకు టీడీపీని పక్కన కుర్చొబెట్టారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి... మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం

టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారాం పర్యటనకు వచ్చినప్పుడు తుప్పలు నరకించడానికి రూ.4 లక్షలు ఖర్చు చేశారని విమర్శించారు. గత నాలుగేళ్లుగా మునిసిపాలిటీలో తాగునీటి సరఫరా మెరుగుపరచాలని చెబితే పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు తాగునీటి సమస్య తలెత్తకుండా మందస్తు ప్రణాళికతో వాటర్ ట్యాంక్, మోటార్లు మరమ్మతులు చేయించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బంది రాలేదని స్పష్టం చేశారు. మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇంటిని తొలగించాలని కోర్టు ఆదేశాలు ఉంటే, దాన్ని వదిలేసి కోర్టు స్టే ఇచ్చిన దుకాణాన్ని ఎందుకు కూల్చారని నిలదీశారు. ఎవరో చెప్పారని చేస్తే తర్వాత అధికారులు ఇబ్బంది పడతారని హెచ్చరించారు. టీపీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకే ప్లాన్ లేకుండా నిర్మించిన భవనం కూల్చామని స్పష్టం చేశారు.


పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

రైవాడకు వైసీపీ చేసిందేమీ లేదు..

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) ఐదేళ్లలో వైసీపీ పాలనలో రైవాడకు ఒక్క పైసా కుడా ఖర్చు చేయలేదు సరికదా, రోడ్లు అభివృద్ధి చేసినట్టు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమర్తి విమర్శించారు. మండలంలోని ఎ.కొత్తపల్లి శివారు సంజీవపురంలో శనివారం పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం పూర్తయిన వెంటనే రైవాడను రైతులకు అంకితం చేస్తానని, ఆరు వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపడతానని చెప్పారు. అంతే కాకుండా రూ.336 కోట్లతో పనులు పూర్తయితే 21 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ నెల 5న రూ.23 కోట్లతో రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్దాడ వెంకటరమణ, నాయకులు పోతల పాత్రునాయుడు, ఆదిరెడ్డి వరలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

దేవరాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేటలో రాజుల వీధిలో రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి స్థానిక ప్రజలు శనివారం వినతిపత్రం అందించారు. సుమారు ఇరవై ఏళ్లకు పైగా రోడ్డు వేయడంతో శిథిలమైందని, రహదారి బురదమయమవుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను స్థానిక ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమేశ్, జామినాయుడు, రాజులమ్మ, నౌడుదేవీ, ఉమా, సత్యవమ్మ, కృష్ణవేణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు నిర్మాణం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేయరూ..

నాతవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాతవరం-తాండవ జంక్షన్ రహదారిలో ప్రమాదాలు జరగకుండా వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. ఈ రూట్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అయితే రోడ్డుకు రెండువైపులా పిచ్చితుప్పలు విపరీతంగా పెరిగి ఉండడంతో దగ్గరకు వచ్చేవరకు ఎదురెదురుగా రాకపోకలు సాగించే వాహనాలు కనిపించడం లేదని ప్రయాణికులు గగ్గోలు పెడతున్నారు. ఒక్కోక్కసారి ఆర్టీసీ బస్సులు దగ్గరకు వచ్చేవరకు ద్విచక్ర వాహనదారులకు కనిపించడం లేదని, ఇక్కడ అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం జరగక తప్పదని ప్రయాణికులు తెలిపారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మండల కేంద్రం నాతవరం-తాండవ జంక్షన్ ఆర్‌అండ్‌బీ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో వంద శ్మశాన వాటికల అభివృద్ధి

» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 30: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వంద శ్మశాన వాటికలు అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బలిఘట్టం విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఉన్న నర్సీపట్నం శ్మశాన వాటికలో సీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో రూ.20 లక్షతో చేస్తున్న అభివృద్ధి పనులు ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయని, వాటన్నింటిని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. పార్కుల మాదిరిగా శ్మశానాలను తీర్చిదిద్దుతామని తెలిపారు. మునిసిపాలిటీలో మిగిలిన నాలుగు శ్మశాన వాటికలు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంటకరమణ, నాయకులు లంక ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నియోజకవర్గ అభివృద్ధికి రూ.60 కోట్ల మంజూరు

గొలుగొండ: నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి రూ.60 కోట్లు మంజూరు చేసినట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని శనివారం ఏటిగైరంపేట గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నెలలో 1వ తేదీ సెలవు దినమైతే ముందురోజే పింఛన్లు రాష్ట్రమంతా ఉదయం ఏడుగంటలలోపే లబ్ధిదారులకు నగదు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. పింఛన్లు పెంచుతామని ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, చెరువులు, పంట కాలువల అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నెల నుంచి మూడు నెలల పింఛను లబ్ధిదారులు పొందవచ్చునన్నారు. భర్త పింఛను పొందుతూ మృతి చెందితే తక్షణమే భార్య పేరుపై పింఛను మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే ప్రభుత సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీ రోజీ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జనసేన నాయకుడు వీరసూర్యచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, సర్పంచ్ బి.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు ఎల్.కాంతం, నాయకులు కొల్లి సత్తిబాబు, బాబ్జి, రాంబాబు, నాయుడు, రవివర్మ, కశిమి బాబూరావు, నల్లబెల్లి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

నాణ్యమైన మందులు లేకపోతే కేసులు

» నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

కృష్ణాదేవిపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మందుల దుకాణాల్లో నాణ్యమైన మందులు లేకపోతే కేసులు నమోదు చేస్తామని నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి హెచ్చరించారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, జోగంపేట, కృష్ణాదేవిపేట తదితర మందుల దుకాణాల్లో రోగులకు ఇస్తున్న మందులను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు పదిషాపులను తనిఖీ చేశామన్నారు.అందులో ఏఎల్‌పురంలో రెండు, చోద్యంలో ఒక దుకాణంలో విక్రయించే మందులు అనుమానం ఉండడంతో క్వాలిటీ నిర్ధారణ పరీక్షలకు పంపామన్నారు. అలాగే చోద్యంలో మందుల దుకాణంలో శాంపిల్స్‌పై ఆరా తీయగా, వైద్య శిబిరానికి తెచ్చామని నిర్వాహకులు తెలిపారన్నారు. మందుల విక్రయాలకు బిల్లులు ఇవ్వడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో బిల్లులు ఇవ్వాలని ఆదేశించామన్నారు. నాసిరకం మందులు విక్రయించినా, మందులు కొనుగోళ్లపై బిల్లులు ఇవ్వకపోయినా తమకు ఫిర్యాదులు చేయాలని ఆమె కోరారు.

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరవుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మండలంలోని ఖండేపల్లి గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం రావడంతో, ఒక రోజు ముందుగానే మండలంలో పింఛన్ల పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.

కె.కోటపాడులో 90 శాతం పింఛన్ల పంపిణీ

» మండల ప్రత్యేకాధికారి పూర్ణిమదేవి

కె.కోటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు మండల ప్రత్యేకాధికారి పూర్ణిమదేవి, ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. మండలంలోని పాతవలస గ్రామంలో శనివారం ఉదయం పింఛన్ పంపిణీ చేపట్టారు. ఈ ప్రక్రియను ప్రత్యేకాధికారి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో పింఛన్లు పంపిణీ విజయవంతం జరిగినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాతవలస సర్పంచ్ జామిస్ శ్రావణ్, టీడీపీ నాయకులు జామి నారాయణమూర్తి, జామి బుచ్చిరాజు పాల్గొన్నారు.


పింఛన్లు అందిస్తున్న ప్రత్యేకాధికారి పూర్ణిమదేవి

మాడుగులలో 92.45 శాతం...

మాడుగుల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ 92.45 శాతం పూర్తయినట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. 23 గ్రామ సచివాలయం పరిధిలో 11650 మంది లబ్ధిదారులు ఉన్నారని, శనివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 10771 మందికి పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి, ఎన్‌డీసీ పీవో డాక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నింగ నిర్ధారణ నిరోధక కమిటీ (పీసీపీఎన్‌డీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమన్న విషయాన్ని అందరూ గ్రహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో సూర్యారావు, డాక్టర్ లక్ష్మణరావు, న్యాయవాదులు రామునాయుడు, చందు తదితరులు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్‌ను గవర కులస్థులు శనివారం ఘనంగా సత్కరించారు. కాకినాడ జిల్లా తునిలో నిర్వహించిన గవర కులస్థుల కార్తీక సమారాధన కార్యక్రమంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ, గవరుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు.

రోజంతా చిరు జల్లులు

చోడవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి జల్లులు పడుతున్నాయి. సాయంత్రం వరకూ రోజంతా అడపాదడపా జల్లులు కురుస్తుండడంతో పాటు చలిగాలులు వీయడంతో ముసరు వాతావరణం నెలకొంది.

మాడుగులలో...

మాడుగుల రూరల్: తుఫాన్ ప్రభావం వల్ల మండలంలో శనివారం ముసురు పట్టింది. వేకువజాము నుంచి చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. రోజంతా ఇలా కురుస్తూనే ఉన్నాయి. సాయంత్రం నుంచి తెరిపిచ్చింది. ఈ సమయంలో పెద్ద వర్షం కురిస్తే వరి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, వరి చేను బాగా ఒరిగిపోయి నీటిలో ఉంటే ధాన్యం గింజలు మొలకెత్తకుండా ఉప్పు నీరు చల్లాలని ఏవో వాసుదేవరావు సూచించారు.

జనసేన మండల అధ్యక్షుడిగా సన్యాసినాయుడు



చీడికాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా శిరిజాం గ్రామానికి చెందిన దిబ్బిడి సన్యాసినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి ఆదేశాల మేరకు సన్యాసినాయుడును నియమించామని చెప్పారు.

కె.కోటపాడు అధ్యక్షుడిగా త్రినాథ్



కె.కోటపాడు: జనసేన పార్టీ కె.కోటపాడు మండల అధ్యక్షుడిగా ఉగ్గిన త్రినాథ్ నియమితులయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ శనివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ పార్టీ కోసం చేసిన సేవా కార్యక్రమాల వల్లే అధ్యక్ష పదవి దక్కిందని, తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు.

వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కృష్ణాదేవిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలోని పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా గ్రామస్థుల సహకారంతో ఆలయ పూజారి కేసనకుర్తి వీర్రాజు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అనంతరం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ల సంఘం ప్రతినిధులు డి.పాపారావు, టి.శివ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా కందిపప్పు

రావికమతం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22,911 తెల్ల రేషన్ కార్డుదారులకు సరిపడా కందిపప్పును పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని తహసీల్దార్ బి.వెంకటరమణ తెలిపారు. ప్రతీ రేషన్ కార్డు వినియోగదారునికి కిలో కంది పప్పు రూ.67 అందిస్తామన్నారు. అలాగే ప్రతీ రేషన్ కార్డుకు అర కిలో పంచదారను కూడా మొబైల్ యూనిట్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నామని తహసీల్దార్ చెప్పారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు రేపు

రావికమతం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు తెలిపారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. 50 మీటర్ల పరుగు పందెం, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్, డ్రాయింగ్, డ్యాన్స్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రావికమతం భవిత కేంద్రంలో మంగళవారం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు


ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, బైక్

నర్సీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఒక ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. అనకాపల్లి జిల్లా ఏఈఎస్ ఎన్.సుర్జిత్‌సింగ్ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్ఐ చినవీర్రాజు, సిబ్బందితో కలిసి శుక్ర వారం దాలింపేటలో బైక్‌పై తరలిస్తున్న 49 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బైక్ సీజ్ చేసి మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. జేపీ అగ్రహారంలో మరో 49 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు ఎంఎస్.రాజు, ఎంఎస్.నాయుడు, సిబ్బంది రమేశ్, సంతోష్, కిరణ్ పాల్గొన్నారు.

నెమ్మదిస్తోన్న మహమ్మారి


అవగాహనతోనే ఎయిడ్స్‌కు అడ్డుకట్ట

- గడిచిన ఏడాదితో పోలిస్తే తగ్గిన కేసుల సంఖ్య
- ఇప్పటికీ వ్యాధి బారినపడుతున్న వారిలో 95 శాతం మంది 40 ఏళ్ల లోపువారే...
- అసురక్షిత లైంగిక చర్యల వల్లే వ్యాధి బారినపడుతున్నట్టు చెబుతున్న అధికారులు
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ దినం

అనకాపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ మహమ్మారి నెమ్మదిస్తోంది. గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కొత్తగా వ్యాధి బారినపడిన వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. గడిచిన ఏడాది జిల్లాలో 1.05 శాతం మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బారిన పడ్డారు. ఈ ఏడాది 0.78 శాతానికి తగ్గింది. అయితే, ఇప్పటికీ వ్యాధి బారినపడుతున్న వారిలో యువత దాదాపు 95 శాతం ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నేడు (ఆదివారం) అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని అందిస్తున్న ప్రత్యేక కథనం...**

ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా డిసెంబరు ఒకటో తేదీన ఎయిడ్స్ డే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి-నా ఆరోగ్యం, నా హక్కు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. కొత్తగా ఎవరినీ హెచ్‌ఐవీ బారినపడకుండా చేయడం, ఇప్పటికే హెచ్‌ఐవీ సోకిన వారిని వివక్ష లేకుండా సామూహికంగా కలుపుకుని పోవడంపై ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కలిగించనున్నారు. తొలిసారి ప్రపంచ ఎయిడ్స్ డేను 1988లో నిర్వహించారు. ప్రస్తుతం 189 దేశాలు ఈరోజు నిర్వహిస్తున్నాయి.





తగ్గుముఖం

అనకాపల్లి జిల్లాలో 2022-23లో 47,048 మందికి పరీక్షలు నిర్వహించగా 429 మందికి (0.91 శాతం), 2023-24లో 51,881 మందికి పరీక్షలు చేయగా 336 మందికి (0.65 శాతం), 2024-25 ఏడాదికి సంబంధించి ఏప్రిల్ నెల నుంచి నవంబరు వరకూ 40,601 మందికి పరీక్షలు నిర్వహించగా 198 మందికి (0.49 శాతం) పాజిటివ్ వచ్చింది. ఈ ఏడాది హెచ్‌ఐవీ బారినపడిన వారిలో ఎనిమిది మంది గర్భిణులు ఉన్నారు.

ఈ నాలుగింటి ద్వారా...

అసురక్షిత లైంగిక సంపర్కం, కలుషిత మైన సిరంజీ, సూది ద్వారా, తల్లి నుంచి (గర్భం దాల్చిన మహిళ జాగ్రత్తలు పాటించడం ద్వారా రాకుండా చేయవచ్చు) బిడ్డకు, రక్తమార్పిడి ద్వారా హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ నాలుగు అంశాల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు. కరచాలనం, కౌగిలించుకోవడం, కలిసి భోజనం చేయడం, ఒకే మరుగుదొడ్డి వాడడం, దోమ కుట్టడం, కలిసి ప్రయాణం చేయడం వల్ల ఒకరి నుంచి వేరొకరికి ఎయిడ్స్ వస్తుందన్నది అపోహ మాత్రమే.

జిల్లాలో 7,688 మంది బాధితులు

జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం 7,688 మంది హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులున్నారు. వీరిలో 3,570 మంది పురుషులు, 3,477 మంది మహిళలు, 71 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. బాధితుల్లో పదిహేనేళ్లలోపు బాధిత బాలురు 319 మంది, బాలికలు 251 మంది ఉన్నారు.

మందులు వాడితే జీవితకాలం పెరుగుతుంది



హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అందిస్తున్న ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడితే వారి జీవితకాలం తప్పకుండా పెరుగుతుంది. కొందరు మందులు సక్రమంగా వేసుకోకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది మంచి మార్గాన్ని ఎన్నుకోండి అనే నినాదంతో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలలో ఏఆర్‌టీ సెంటర్లు ఉన్నాయి. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై కళాశాలలు, స్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ సీహెచ్ స్పందన, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం, అనకాపల్లి

అసురక్షిత లైంగిక సంబంధాలతోనే..

గతంలో సెక్స్ వర్కర్లు, లారీ డ్రైవర్లు, ట్రాన్స్‌జెండర్స్ వంటి వారిలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పాజిటివ్ కేసులు కనిపించేవి. అయితే, ఇప్పుడు వారంతా సురక్షితమైన లైంగిక పద్ధతులను అనుసరిస్తుండడంతో ఆ కేటగిరీల్లో పాజిటివ్ కేసులు పూర్తిగా తగ్గాయి. ప్రస్తుతం ఎయిడ్స్ బారినపడుతున్న వారిలో ఎక్కువ మంది యువత ఉంటున్నారు. వీరంతా అసురక్షిత లైంగిక సంబంధాలను కొనసాగించడం వల్లే మహమ్మారి బారినపడుతున్నట్టు నిర్ధారణ అవుతోంది. అనారోగ్యం కారణంగా రక్త పరీక్షలు చేయించుకున్నప్పుడు దాదాపు 80 శాతం మందికి ఈ వ్యాధి ఉన్నట్టు తేలుతోంది. వీరిలో దాదాపు 90 శాతం మంది తామెక్కడా తప్పు చేయలేదని, తెలిసిన వారితో రిలేషన్ ఉందని చెబుతున్నారు. అంటే, తెలిసిన వాళ్లే కదా అని అసురక్షిత పద్ధతుల్లో లైంగిక చర్యలకు పాల్పడినా ఎయిడ్స్ వచ్చే ప్రమాదం ఉంది.



వెనక్కి వెళ్లిన సముద్రం

ముత్యాలమ్మపాలెంలో వెనక్కి వెళ్లిన సముద్రం

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెంలో శనివారం సముద్రం వెనక్కి వెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. ఒడ్డు నుంచి సుమారు 15 మీటర్లు మేర సముద్రం వెనక్కి వెళ్లింది. తుఫాన్లు, ఆటుపోట్లు వచ్చే సమయంలో సముద్రం వెనక్కి వెళ్లడం సర్వసాధారణమని మత్స్యకారులు చెబుతున్నారు. అయితే శనివారం ఉదయం పది గంటల సమయంలో వెనక్కి వెళ్లిన సముద్రం సాయంత్రం నాలుగు గంటలకు యథావిధిగా ముందుకొచ్చింది.

18 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు

హుకుంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ చేసిన 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని స్థానిక ఎస్ఐ సురేశ్ తెలిపారు. దీనికి సంబంధించి శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోరాపుట్ జిల్లాకు చెందిన పులకర, రాయగడ జిల్లాకు చెందిన బాబుల్‌సగారియా భీమవరంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేశారు. ఆ సమయంలో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. అనంతరం హుకుంపేట మండలం ములియపుట్టు పంచాయతీ శాంతినగర్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కొంతకాలంగా ఉంటున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఆ ఇంట్లో రవాణాకు సిద్ధం చేసిన 18 కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

దర్జాగా ఆశీలు దందా

... 5వ పేజీ తరువాయి

వసూలు చేయాల్సి ఉండగా, రూ.20 తీసుకుంటున్నారు. ఈ విధంగా నెలకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సంపాదిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు రశీదులు ఇస్తూ దర్జాగా వసూళ్ల దందాను ఆరు నెలలుగా కొనసాగిస్తున్నా, అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయ రెవెన్యూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై జీవీఎంసీ జోనల్ కార్యాలయం రెవెన్యూ అధికారి ఎల్.సురేశ్‌ను వివరణ కోరగా, ప్రైవేటు వ్యక్తుల వసూళ్ల వ్యవహారం తమ దృష్టికి రాలేదన్నారు. వార్డు సచివాలయాల సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది మాత్రమే ఆశీలు వసూలు చేయాలన్నారు. కొద్ది రోజుల్లో ఆశీలు వసూలుకు పాట నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

మొక్కే కదా అని పీకేస్తే..

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. శనివారం మునిసిపల్ ఆవరణలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీధి దీపాల సమస్యను వైస్ చైర్మన్ ఆరెపు నాగ త్రినాథగుప్తా లేవనెత్తారు. వీధి దీపాల నిర్వహణ ఘోరంగా ఉందని, దీనిని కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని చెప్పారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ పనులకు సంబంధించి అజెండాలో నిధుల వ్యయమే తప్ప పూర్తి వివరాలు కౌన్సిలర్లకు ఎందుకు వివరించడం లేదని ప్రశ్నించారు. ఇక నుంచి పూర్తి వివరాలను కౌన్సిల్ ముందు ఉంచాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. 2022-23 సంవత్సరం రెండవ విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.72 కోట్లు మంజూరయ్యా యని, వీటిని నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులకు వినియోగించాలని అజెండాలో సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలన్నారు. మునిసిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను వివరించారు. కాగా ఈ సమావేశానికి 25 మంది పాలకవర్గ సభ్యులకు గాను 11 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఏఈ గణపతి సుబ్బారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులకు అడ్డేలేదు

- యథేచ్ఛగా శారదా నదిలో తవ్వకాలు
- ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని అనుకూలంగా మార్చుకుంటున్న వైనం
- స్థానిక నాయకుల అండదండలతో దందా
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

రాంబిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైలోవ గ్రామంలోని శారదా నది వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. స్థానిక నాయకుల అండదండలతో అక్రమార్కులు తవ్వకాలు జరిపి నది సమీపంలోనే నిల్వ చేసి దర్జాగా అమ్మకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నప్పటి నుంచి అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అడ్డం పెట్టుకుని శారదా నది వద్ద ఇసుకను తవ్వి తరలిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. వైలోవ గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కొండను ఆనుకొని ఉన్న శారదా నది వద్ద బాటలు ఏర్పాటు చేసుకొని నదిలో ఇసుకను తవ్వి సమీపంలో గుట్టలుగా నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామాలకు తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ఇసుక ట్రాక్టర్ లోడు రూ.5 వేలు నుంచి రూ.7 వేలు వరకు విక్రయిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలతోనే రేయింబవళ్లు తేడా లేకుండా శారదా నది నుంచి ఇసుకను తవ్వి తరలించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రానికి శివారు గ్రామం కావడంతో ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంతో ఇసుక దందాను కొనసాగిస్తున్నారని అంటున్నారు. ఈ నది వద్ద గల కొండ చుట్టూ ఉన్న నేవీ ప్రహరీ గోడ లోపల కూడా ఇసుకను గుట్టలుగా నిల్వ చేస్తున్నారు. దర్జాగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



వైలోవ వద్ద అక్రమార్కులు ఇసుకను తవ్వి తరలిస్తున్నది ఇక్కడి నుంచే..



నది సమీపంలో నిల్వ చేసిన ఇసుక

రైతు గుండెల్లో తుఫాన్

... 5వ పేజీ తరువాయి

గ్రామాల్లో కోసిన వరిపనులు తడిసి ముద్దయ్యాయి. నాతవరం మండలంలోని పలు గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. కోటవురట్ల మండలంలోని జల్లూరు, కైలాసపట్నం, కోటవురట్ల, టీకేపల్లి, రాజుపేట, లింగాపురం యండపల్లి గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కశింకోటలో 11.8 శాతం వర్షపాతం

కశింకోట: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచాయి. దీని వల్ల చేతికొచ్చిన వరి పంట కొన్ని ప్రాంతాల్లో నేలకొరిగింది. కశింకోటకు చెందిన పెంటకోట శ్రీనివాసరావు, సత్యనారాయణ సుమారు రెండు ఎకరాల్లో వరిని సాగు చేసుకున్నారు. అయితే రెండువారాల్లో వరి చేతికి రావాల్సి ఉండగా, తుఫాన్ కారణంగా వీచిన ఈదురుగాలులకు పంట నేలమట్టమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సుందరయ్యపేట, అడ్డాం, వెదురుపర్తి, సోమవరం, నర్సింగబిల్లి, ఎస్‌జిపాలెం తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన వరిపైరు నేల కొరగడంతో రైతన్న తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేసేది లేక నేల కొరిగిన వరి పైరును పనలు చొప్పున తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి ఈదురుగాలులు తగ్గుముఖం పట్టి చిరుజల్లులు పడడంతో రైతులు కొంత మేర ఊపిరిపీల్చుకున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి చిరుజల్లులు మండలం మొత్తం పడ్డాయి. దీంతో 11.8 శాతం వర్షపాతం నమోదైంది.

మాకవరపాలెంలో..

మాకవరపాలెం: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పల్లపు ప్రాంతాలైన పైడిపాల, కొండలఅగ్రహారం, బయ్యవరం, గిడుతూరు, మల్లవరం గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. అలాగే మాకవరపాలెం, తామరం, నారాయణరాజుపేట, జంగాలపల్లి, బూరుగుపాలెం, తూటిపాల గ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. ఇప్పటికే 90 శాతం వరి పంట కోతకు సిద్ధంకాగా, ఈదురుగాలులు, వర్షాల వల్ల వరిచేలు నీటమునగడంతో అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వరి మడుల్లో నీటి నిల్వలు ఉంటే వాటిని తొలగించాలని వ్యవసాయాధికారి చిరంజీవి సూచిస్తున్నారు. మరో మూడు రోజుల వరకు వరి కోతలు కోయవద్దని చెబుతున్నారు.

కన్నుల పండువగా పద్మనాభుని దీపోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవ సమేత అనంత పద్మనాభుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై నిలిపి తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం బృందాల ప్రదర్శనల నడుమ, వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ గరుడ వాహనంపై స్వామి వారిని నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామివారికి పూజలు చేశారు. ప్రథమ పావంచాల వద్ద జేగంట కొట్టగానే భక్తులు అప్పటికే మెట్లపై సిద్ధం చేసుకున్న దీపాలను వెలిగించారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం దేదీప్యమానంగా మారింది. ఉత్సవం సందర్భంగా పద్మనాభం సామాజిక వేదిక వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన అల్పాహారం, మజ్జిగ పంపిణీ స్టాల్‌ను భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథుర్ ప్రారంభించారు. పలువురు దాతలు కొండపైన, దిగువన భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత ఆధ్వర్యంలో నార్త్‌జోన్ ఏసీపీ అప్పలరాజు, సీసీఎస్ ఏసీపీ లక్ష్మణరావు, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆధ్వర్యంలో సుమారు 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు దామోదరరావు, నగేష్‌కుమార్, ఏపీ నాగవంశం కార్పొరేషన్ మాజీ చైర్మన్ అప్పలకొండమ్మ, అప్పలనాయుడు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచ్ పాప, బీజేపీ ఏపీ వైద్య విభాగం కన్వీనర్ రవికుమార్, జనసేన భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభుని దీపోత్సవం

క్రైం... crime news

గ్యాస్ సిలిండర్ లీకై పెంకుటిల్లు ధ్వంసం

- రూ. 10 లక్షల వరకు ఆస్తి నష్టం

జి.మాడుగుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రంలో గ్యాస్ సిలిండర్ లీకైన ఘటనలో పెంకుటిల్లు ధ్వంసమైంది. ఈ ఘటనలో రూ. 10 లక్షల మేరకు ఆస్తికి నష్టం జరిగింది. వివరాలివి.. స్థానికంగా సోమెలి భాస్కరరావు, సింహాచలం సోదరులు ఒకే పెంకుటింట్లో నివాసముంటున్నారు. శనివారం మధ్యాహ్నం ప్రమాదశాత్తూ ఇంట్లోని గ్యాస్ సిలిండర్ లీకైంది. వెంటనే స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. దీంతో అగ్నికీలలు వ్యాపించి ఇంట్లో వస్తువులు, బంగారం, నగదు, డీఎస్‌సీ పాసైన ధ్రువపత్రాలు కాలి బూడిదయ్యాయి. ఇరు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో రూ.10లక్షల వరకు ఆస్తికి నష్ట వాటిల్లినట్టు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.





కోడాపల్లిలో గ్యాస్ సిలిండర్ లీకై దట్టంగా వ్యాపించిన పొగ (ఇన్‌సెట్‌లో) లీకైన గ్యాస్ సిలిండర్

బొగ్గు లోడుతో లారీ బోల్తా

పరవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బొగ్గు లోడుతో వెళుతున్న లారీ శనివారం రాత్రి అదుపు తప్పి బోల్తా పడింది. రహదారిపై నిలిచిపోయిన మరో బొగ్గు లారీని తప్పించే క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో హిందూజా పవర్ ప్లాంట్‌కు లారీ బయలుదేరింది. సరిగ్గా స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా రహదారిపై మరో బొగ్గు లారీ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. ఆ లారీని తప్పించే క్రమంలో ఈ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా బొగ్గు లారీ బోల్తాపడడంతో స్థానిక మండల పరిషత్ జంక్షన్ నుంచి బ్యాంక్ కాలనీ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీని వల్ల అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు.



బొగ్గు లోడుతో బోల్తాపడిన లారీ

254 మద్యం సీసాలు స్వాధీనం

ఎలమంచిలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలో అక్రమంగా రవాణా చేస్తున్న 254 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి శనివారం తెలిపారు. ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను తరలిస్తున్న మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డుకు చెందిన సూర్యప్రకాశ్, గణేశ్‌లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

సీఎం, డిప్యూటీ సీఎంలను దూషించిన వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన గుంటూరుకు చెందిన పి.అనిల్‌ను శనివారం అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎంలను దూషిస్తూ గత నెలలో సోషల్ మీడియాలో అతను పోస్టులు పెట్టడంతో స్థానిక టీడీపీ నాయకుడు బొడ్డేడ రాజేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న అనిల్‌ను అనకాపల్లికి తీసుకు వచ్చి అరెస్టు చూపించి తిరిగి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	590
విజయనగరం	594
శ్రీకాకుళం	594